ప్రభ:- జ్ఞానశక్తి లేని జడులయందును, క్రియాశక్తి లేని అలసులయందును గూడ దేవి - నిద్రించుచుండును. కావున వారియందు వలె నాయందు నిద్రిపంకుము. నాయందు నిరంతరముగా సంచరింపుమని భావము.

మూ॥ అయంతవాగ్రిమః సుతః, శ్రితో మనుష్యవిగ్రహమ్।
తనూజవేశ్మ సౌష్ఠవం మృడానిపశ్యకీదృశమ్. 24

ఈ నీ పెద్దకొడుకు (గణపతి) మనుష్య విగ్రహమును (మానవ దేహమును) ఆశ్రయించియున్నాఁడు. మృడానీ! నీ పుత్రుని గృహము యొక్క (శరీరము యొక్క) సౌష్ఠవము - ఎట్టిదో చూడుము.

ప్రభ:- మానవ శరీరుఁడగు గణపతి యొక్క శరీరసుస్థితి - యెట్టిదో విలోకింపుమని భావము.

మూ॥ గణేశితుర్మహాకవే రసౌ ప్రమాణికావలీ
మనోమ్బుజే మహేశ్వరీ ప్రపూజనేషు శబ్ద్యతామ్. 25

మహాకవియగు గణేశ్వరకవి రచించిన యీ ప్రమాణికావళి (ప్రమాణికా వృత్త నిబద్ధములగు శ్లోకముల సంహతి) మహేశ్వరీ పూజలయందు పూజకుని మనఃకమలమున నుచ్చరింపఁబడుఁగాక!

ఇది - సవ్యాఖ్యమగు త్రింశస్తబకము

* * * *

ఓం నమోభగవతే శ్రీరమణాయ శ్రీ భారతీదేవ్యైనమః

ఉమా సహస్రము

(ఎనిమిదవ శతకము – తృతీయ స్తబకము)

ఏకత్రింశ స్తబకము

అవ:- ఈ ముప్పది యొకటవ స్తబకమున భగవతీనామ మహిమ - కీర్తింపఁబడుచున్నది.

మూ॥ దరస్మిత శ్రీకపటా సుపర్వ
స్రోతస్వినీ పర్వతజాస్యజాతా।
పఙ్కం మమక్షాలయతా దశేషం
సంసారమగ్నే హృదయే విలగ్నమ్॥ 1

పర్వతము నుండి యుదయించిన పార్వతి యొక్క ముఖము నుండి జనించిన దరహసిత ప్రభయను కపటము (మిష) గల దేవనది - (గంగ) జనన మరణాత్మకమగు సంసారమున మునిఁగిన నా హృదయమున విలగ్నమగు పంకమును (పాపమును, లేక బురదను) కడిగివేయునుగాత!

ప్రభ:- గంగానదియే కపటము చేత పార్వతీముఖమునందలి మందహాస ప్రభగా తోఁచుచున్నదని చెప్పఁబడినది. దేవనదియగు గంగ–పాపములను ప్రక్షాళితముల నొనర్చును. ''ఆ గంగయే - పార్వతీ ముఖమునందలి 'చిరునవ్వుతళుకు' అనుమిషతోనున్నది'' అని చెప్పఁబడినదిగదా! ఇచట– కపటశబ్ద ప్రయోగము చేత ఉపమేయమగు మందహాస ప్రభ - అసత్యముగాఁ జేయఁబడి, ఉపమానమగు గంగానది సత్యముగా ప్రదర్శింపఁబడినది. కనుక, ''ప్రకృతం యన్నిషిధ్యాన్యత్; సాధ్యతే సాత్వపహ్నుతిః'' ''ప్రస్తుత విషయమును నిషేధించి

అప్రస్తుత విషయమును సాధించడమనునది యపహ్నుతియగును.'' అను కావ్యప్రకాశోక్తలక్షణము వలన నిది - అపహ్నుతియనునలంకార మగుచున్నది.

మూ॥ హరాట్టహాసేన సమం మిలిత్వా
పిత్రేవ పుత్రో గురుణేవ శిష్యః
విభ్రాజమానో మమ శంకరోతు
హాసాంకురః కేసరి వాహనాయ॥ 2

తండ్రితోఁగూడిన తనయుఁడువలెను, గురునితోఁ గూడిన శిష్యుఁడు వలెను, హరుని యట్టహాసముతోఁ గూడి, విభ్రాజమానమగు సింహవాహన (పార్వతి) యొక్క హాసాంకురము - నాకు సుఖమును గలిగించుఁగాత!

ప్రభ:- పితా పుత్రులువలెను, గురుశిష్యులవలెను కలిసియున్న హరాట్టహాస- దేవీ మందహాసములు - నాకు సుఖమునిచ్చుఁగాతమని ప్రార్థనము. హరుని యట్టహాసము - భయంకరము. దేవీమందహాసము - సుందరము. వాని సంబంధము - హరరౌద్రతకు, శాంతిని కలిగించును. దీనిచేత - సేశ్వరయగు సింహవాహనయొక్క మందహాసములకు రామణీయకమును, లోకోత్తర ప్రభావమును, ధ్వనింపఁజేయఁబడినవి.

మూ॥ నమశ్శివాయై భణతద్విపాదో
యుష్మాకమగ్ర్యాంధిషణాం దధత్యై
ఆధారచక్రే శిశురమ్బికాయై
బ్రహ్మాణ్డచక్రస్య విధాయికాయై 3

ఓ ద్విపాదులారా! (ద్విపాద పశువులారా!) బ్రహ్మాండ చక్ర విధాయికయు, మూలాధార చక్రాధిశాయియగు గణపతికి అంబికయు, మీకు శ్రేష్ఠమగు ప్రజ్ఞనిచ్చునదియు, అగు శివకు (పరమేశ్వరికి) నమోవాకమును పలుకుఁడు.

ప్రభ:- ''అధ్యండ స్వరూపమున విశ్వవిధాత్రియు, అధిపిండస్వరూపమున, సర్వాధార మూలాధిష్ఠాతయగు గణపతికి తల్లియునగు దేవికి నమస్కరింపుఁడు. అట్లు నమస్కరింపని యెడల, చతుష్పాద జంతువులగు వ్యాఘ్రాదులకును, ద్విపాద జంతువులగు మీకును, భేదమేమియుఁ గలుగదు'' అని భావము.

మూ॥ వదన్తి గావోఽపి విశిష్టకాలే
ష్వమ్బేతి యోనాహ్వయతే సకింనా
లక్ష్యంపునః ప్రాణవదస్తు సర్వం
సర్వస్యచాన్తర్హి పరాఽస్తిశక్తిః, 4

గోవత్సములు కూడ - పాలుపితుకునపుడు 'అంబా!' అని శబ్దము నొనర్చుచుండును. విశిష్టకాలమున (అనుగ్రహప్రాప్తి సమయమునందు) అంబా! అని పిలువనివాఁడు మనుష్యుడా? సర్వమునందును గూడ - పరాశక్తి (పరయగుశక్తి) యున్నది. కావున ప్రాణముగల వస్తువంతయును గూడ - ('అమ్మా' అని సంబోధింపఁదగిన) లక్ష్యమే- (లక్షింపఁదగిన దృశ్యమే) అగును.

ప్రభ:- పరాశక్తి - సర్వాంతర్వర్తి ని. కావున నాయమ్మను పిలుచుటకు సర్వమును లక్ష్యమేయగును. మనుష్యులాయమ్మను సంబోధింపని యెడల వారు గోవత్సములకంటెను గూడ నధములేయగుదురని భావము.

మూ॥ ఆత్మన్యుతాన్యత్ర విధాయలక్ష్యం
తాం శక్తి మాద్యామఖిలేషు సుప్తామ్
యావత్ ప్రబోధం ముహురాహ్వయస్వ
ప్రబుధ్యతే సాయదికిన్నుసాధ్యమ్ 5

స్వాత్మయందును, తదితరమునందును లక్ష్యమునుంచి (బుద్ధి గోచరమగునట్లు హృదయమున గుర్తించి) సర్వమునందును నిద్రించునది యగు

నాదిశక్తిని మేల్కొనునంతవఱకును ఆహ్వానింపుము. నీయాహ్వాన బలమువలననది మేలుకొనిన యెడల అసాధ్యమేముండును?

ప్రభ:- శక్తి నాహ్వానించిన వానియందు శక్తి ప్రబోధము కలుగును. వానికి సర్వమును శక్యమగును.

మూ॥ యేనామశాన్తిం పరమాం వహన్తో
నామాని శీతాచలపుత్త్రికాయాః
సఙ్కీర్తయన్తో విజనేవసన్తి
జయ న్తతాతాదపితే జయన్తి 6

శ్రేష్ఠమగు శాంతిని వహించుచు, శీతాచలపుత్త్రికయగు పార్వతియొక్క నామములను సంకీర్తనమొనర్చుచు, వివిక్తస్థలమునందు వసించువారగు జనులు- జయంతజనకుఁడగు నింద్రునికంటెను గూడ జయము నొందియుందురు (ఉత్కృష్టులై యుందురు)

ప్రభ:- విజనప్రదేశమున నివసించుచు, శాంతి సంపన్నులై పార్వతీ నామ సంకీర్తనపరులగు మనుష్యులు - దేవేంద్రునికంటెను గూడ నుత్కృష్ట జీవనులగు చుందురని భావము.

మూ॥ నామాని సఙ్కీర్తయతాం జనానాం
కారుణ్యవత్యాః కరివక్త్రమాతుః
పునర్జనన్యా జఠరే నివాసా
దాయాసవత్తా భవతీతిమిథ్యా॥ 7

కారుణ్యవతియు, గజాననమాతయు, అగు పార్వతి నామములను గానము చేయు జనులకు - తిరుగ జననీ జఠర నివాసము వలని దుఃఖము (గర్భవాసశ్రమ) కలుగుననుట మిథ్య. (అనృతము)

ప్రభ:- ''దేవీ నామ సంకీర్తన పరులకు పునర్జన్మము కలుగదు. ఇది - సత్యము'' అని భావము.

మూ॥ పాపైస్సమన్తాత్ సమభిద్రుతోఽపి
విశ్వస్యతే విక్రమ మస్మిధీరః
నచేద్రసజ్ఞే! భవతీ బ్రవీతి
నామాని శీతాంశుభృతోహతోఽహమ్. 8

ఓ రసజ్ఞా! (రసము నెఱుఁగుచున్న నాలుకా!) పాపముల చేత నంతటగూడ నాక్రమింపఁబడి యున్నను నీవిక్రమమును విశ్వసించి - ధీరుఁడనై (భయరహితుఁడనై) యున్నాను. చంద్రధారిణివగు పార్వతి యొక్క నామములను నీవు పలుకని యెడల నేనుహతుఁడనగుదును.

ప్రభ:- జిహ్వాబలమున బద్ధశ్రద్ధుఁడనగు నేను - దేవీ నామగానము నొనర్చి నా పాపముల నెల్ల ధ్వంసము చేయఁగలను. కాని యీ జిహ్వా-నామోచ్చారణము నొనర్పని యెడల గతియేది?

మూ॥ దేహీతి సమ్పల్లవదర్పితానాం
ద్వారేషు ఘోషం కురుషే పరేషామ్।
భవాని! భద్రే! భువనామ్బ! దుర్గే!
పాహీతినాయాతి కిమమ్బ! జిహ్వే! 9

అవ్వా! నాలుకా! సంపల్లేశము చేత గర్వించిన యితరుల గృహద్వారములయందు 'దేహి' (ఇమ్ము) అని దానమునకై యాచ్ఞాఘోషము నొనర్చుచుందువు. భవానీ! సర్వమంగళా! లోకమాతా! దుర్గా! పాహి (రక్షింపుము) అనుఘోష (పలుకు) నీకేలరాకున్నది?

ప్రభ:- అల్పమగు సంపదచేతఁగూడ దర్పించిన మనుష్యుల నాశ్రయించి 'దేహి'' అను నీచమగు యాచనను నిందించి, భవానీత్యాది నామములను కీర్తించుటయే- సర్వాభీష్టదమని చెప్పఁబడినది.

మూ॥ వాక్యానివక్తుం యది తే రసజ్ఞే!
రసోజ్జ్వలాని వ్యసనం గరీయః
కిం వానమోన్తాని సుధాం కిర న్తి
నామానినోసన్తి కుమార మాతు 10

ఓ రసజ్ఞా! (నామ రసాస్వాదన నిపుణమగు రసనమా!) శృంగారాది రసముల చేత దేదీప్యమానములగు వాక్యములను (కావ్యములను) పలుకుటయందు నీకు గురుతరమగు వ్యసనమున్న యెడల, (గొప్ప కోరిక యందుయున్నచో) అమృతమును విక్షేపించునవియు- 'నమః' అను పదము చివరను గలవియు, అగు కుమారమాతయగు దేవియొక్క నామములు లేవా?

ప్రభ:- అమృతవర్షులగు దేవీ నామములు - రసోజ్జ్వల వాగమృతవైభవాతిశాయులు, కావున వాని నుచ్చరింపుమని భావము.

మూ॥ యద్గీయతే శైలసుతాభిధానం
తదేవబోధ్యం సుకృతం ప్రధానమ్
అజ్ఞానిలోకస్య కృతేభణన్తి
యజ్ఞాది పుణ్యాని పరాణివిజ్ఞాః॥ 11

పార్వతీనామగానమే ప్రధానమగు పుణ్యమని తెలియదగినది. **అజ్ఞాని లోకము కొఱకు** విజ్ఞులు అగ్నిష్టోమాది యజ్ఞములను ప్రధానములగు పుణ్యములనుగాఁ జెప్పుచున్నారు.

ప్రభ:- యజ్ఞము - పరమ పావనమనుట యౌపచారికము, పరమార్థము వలన దేవీ నామకీర్తనమే ఉత్తమ పుణ్యమని భావము.

మూ॥ సామ్నా ప్రయుక్తేన జగద్ వశేస్యా
న్నామ్నాసదోక్తేన జగద్వినేత్రీ।
వేదోభయం సమ్యగిదం కృతీయో
భవేభయం తస్యకుతోఽపి నస్యాత్॥ 12

సామ (ప్రియవచన) ప్రయోగము చేత - జగత్తు వశపడును. సంతతమగు నామ సంకీర్తనము చేత జగన్నాయికయగు నీశ్వరి వశపడును. ఈ రెంటిని గూడ చక్కగా నెఱిఁగిన వానికి జన్మము నందు దేనివలనను గూడ భయము కలుగదు.

ప్రభ:- జగత్తు వశపడిన యెడల జన్మమున సుఖమే కలుగును. కావున దాని వలన భయము కలుగదు. జగన్మాతయగు దేవి - భక్తిపాశబద్ధయై వశంవదయగు నెడల జన్మభయమే కలుగదు. సర్వవిధముల చేతనుగూడ - సామ-నామ ప్రయోక్తలకు జన్మవలని భయము లేదని భావము.

మూ॥ సత్కీర్తనాత్ తుష్యతి శర్వయోషా
తుష్టా త్వభీష్టం న దదాతి నైషా
ఇమంత్వవిజ్ఞాయ జగత్యుపాయం
వ్రజన్త్యపాయం బహుథామనుష్యాః॥ 13

శివ సుందరియగు పార్వతి - నామ భజనము వలన సంతుష్టురాలగును. సంతుష్టయగు నాయమ్మ అభీష్టమునీయక మానదు. లోకము నందలి మనుష్యులు- ఈయుపాయమును తెలియక బహుప్రకారముల చేత అపాయము నొందుచుందురు.

ప్రభ:- శివసుందరీ సంకీర్తనము - కార్య సాధనమని తెలియని వారనిష్టము నొందుదురని భావము.

మూ॥ భాషే భుజఙ్గాభరణ ప్రియాయా
నామాని కామానితరాన్ విహాయ
అపిప్రపఞ్చాతిగ ఘోరకృత్యం
కరోతుకిం మాంతరణేరపత్యమ్॥ 14

ఇతరములగు కోరికలను పరిత్యజించి తదేక కాముఁడనై భుజంగాభరణుఁడగు శివుని ప్రియురాలగు పార్వతి యొక్క నామములను భాషింతురు. ప్రపంచము నతిక్రమించినదియు, (చింతింపశక్యము కానిదియు) ఘోరమగు నదియు, నగు కర్మగలవాఁడనైను గూడ- వివస్వంతుని యపత్యమగు (సూర్యపుత్రుఁడగు) యముఁడు- నన్నేమి చేయును?

ప్రభ:- దేవీ నా మైకరతుఁడనగునన్ను అతి భయంకర కర్ముఁనైనను యముఁడు బాధింపఁజాలఁడని భావము.

మూ॥ యజ్ఞేన దానైః కఠినవ్రతైర్వా
సిద్ధింయ ఇచ్ఛేత్ స గృహీతుమిచ్ఛేత్।
మాతుః శయానోఽఙ్కతలే శశాఙ్కం
మహేశ్వరీం కీర్తయతస్తు సిద్ధిః॥ 15

సోమయాగాది రూపమగు యజ్ఞము చేతను, భూగోహిరణ్యాన్నాదులగు దానముల చేతను, కృచ్ఛ్రచాంద్రాయణాదులగు కఠిన వ్రతముల చేతను, సిద్ధిని (శక్తి శాంతి సమృద్ధమగు స్థితిని) గోరినవాఁడు. తల్లియొడి యందు శయనించి చంద్రుని గ్రహింపఁ గోరినవాఁడు, మహేశ్వరిని కీర్తించువానికే సిద్ధి కలుగును.

ప్రభ:- తల్లియంకమున శయనించిన బాలునికి చంద్రలబ్ధియెట్టిదో, యజ్ఞాదులచే నగు సిద్ధి యట్టిదేయగును. సత్యమైన సిద్ధి - దేవీ కీర్తన పరునికి మాత్రమే లభించును. అని భావము.

విశే:- ఇచ్ఛట - యజ్ఞాదుల చేత సిద్ధి నభిలషించుట - మాత్రంకశయతుఁడగు శిశువు - చంద్రుని గోరుట - అని ఉపాత్త విషయద్వయమునందగు అర్థాభేదము - 'సాదృశ్యమున పర్యవసించును. కావున నిది నిదర్శనాలంకారమగుచున్నది. '' ఉపాత్తయో రర్థయో రర్థాయో ర్థాభేదజౌపమ్య పర్యవసాయీ నిదర్శ నా'' ఉపాత్తములగు నర్థముల కభేదమగు నర్థము కలుగునపుడు- జౌపమ్యమునఁ బర్యవసించునది యగునంలకృతి - నిదర్శన. అని జగన్నాథ పండితునిచేఁ దెలుపఁ బడినదిగదా!

మూ॥ రహస్యతంత్రాణి వివిచ్యదూరం
వ్యాజం విముచ్య ప్రవదామి సారమ్।
నామైవ కామారి పురన్ధ్రికాయాః
సిద్ధేర్నిదానం న మఖోనదానమ్ 16

రహస్యములగు తంత్రములను (శాస్త్రములను) దీర్ఘముగా విచారించి- కపటమును త్యజించి, సారాంశమును ప్రవచించెదను. అదేమనిన; కామారిపురంధ్రి యగు పార్వతి యొక్క నామమే - సర్వ పురుషార్థ సిద్ధికిని మూలకారణముగాని- మఖముగాని, దానముగాని, మూలహేతువులు కావు.

మూ॥ పీయూషమీషన్మధురంభణన్తి
యేనామరామాధరపానలోలాః
కామారి రామాహ్వయగానలోలాః
కవీశ్వరాః కాఞ్జికమాలపన్తి 17

కాంతల కెమ్మోవి నాస్వాదించుట యందాసక్తులగు వారు పీయూషము (అమృతము) అల్పమేయగు మాధుర్యము గలదని చెప్పుదురు. కామారియగు శివుని రామయగు పార్వతినామమును సంకీర్తించుట యందాసక్తులగు కవీశ్వరులు- **ఆ పీయూషమును కాంజికమని (ఆరనాలకమని, గంజి) చెప్పుదురు.**

ప్రభ:- లోకులు పీయూషమునందించుక వామాధుర్యమున్నదని యంగీకరింతురు కాని యది కాంతాధరమాధుర్యమునకు సదృశముగాదని యనుభవపూర్వకముగాఁ జెప్పుదురు. భక్తులగు కవీశ్వరులు పరమేశ్వరీ నామగానామృత మాధుర్యము - సర్వోత్తరర సాతిశాయియని యెఱుఁగుదురు.

మూ॥ సుధాఘటఃకోఽప్యధరో వధూనాం
కవి స్సుధాతో యధరోఽభిధేయః
అయం సుధావీచివితానమాలీ
నామప్రణాదో నగకన్యకాయాః 18

స్త్రీల యధరము - 'అనిర్వాచ్యమగు అమృతముచే నిండిన ఘట-విశేషమనియు, కవి - 'పియూషవర్షియగు మేఘుఁ'డనియు, పర్వత కుమారి యొక్క యీనామసంకీర్తన ధ్వని- 'అమృతోర్మివితాన (విస్తర) మాల, యనియు (అమృతసాగర మనియు) చెప్పఁదగినవి.

ప్రభ:- కాంతాధరము - అమృతకలశము - కావ్యనిర్మాత - అమృత మేఘము - దేవీనామము - అమృతసాగరము, అని యొకదానికంటె నింకొకదానికి గొప్పతనము కీర్తింపఁబడినదని తెలియునది.

మూ॥ సురాలయే భాతితరాం సుధైకా
సుధాపరా వాచి మహాకవీనామ్।
బిమ్బాధరే కఞ్జదృశాం సుధాన్యా
సుధేతరానామని లోకమాతుః 19

సురాలయమునందు (స్వర్గమునందు) ఒక యమృతమును, మహాకవుల వాక్కునందింకొక యమృతమును, పద్మాక్షులయధరము నందు వేరొక యమృతమును, లోకమాతనామమున మఱియొక యమృతమును, మిక్కిలి ప్రభాసించుచున్నవి.

ప్రభ:-సురాలయాదుల యందుఁగల యమృతము లొకదానికంటె నొకొకటి భిన్నమని గ్రహించునది. ఇచట - అప్రస్తుతములగు సురాలయామృతాదులకును ప్రస్తుతమగు లోకమాతృనామామృతమునకు - 'మిక్కిలి ప్రభాసించుట' అనునొకే ధర్మముతోడి సంబంధము వలన దీపక మలంకారమగుచున్నది.

''వదన్తి వర్ణ్యావర్ణ్యానాం ధర్మైక్యం దీపకం బుధాః''

ప్రస్తుతాప్రస్తుతములకు ధర్మైక్యము దీపకమని పండితులు చెప్పుదురు. అనునది దీపకలక్షణము.

మూ॥ మాధుర్యమాభాత్యధరే వధూనాం
చకోరబన్ధోః శకలే ప్రసాదః
త్రిస్రోతసో వారిణి పావనత్వం
త్రయంచనామ్ని త్రిపురామ్బికాయాః 20

కాంతల యధరమునందు మాధుర్యమును, చకోరబంధువగు చంద్రుని యొక్క ఖండమునందు ప్రసాదమును, (ప్రసన్నతయు) గంగాజలమున (తీర్థమున) పావనత్వమును, ప్రకాశించును. త్రిపుర సుందరీదేవి నామమున ఈ మూఁడును గూడ ప్రకాశించుచుండును.

ప్రభ:- కాంతధరమాధుర్యాదుల కంటెను గూడ - త్రిపురాంబికా నామమునకు గల విశిష్టత వలన నిది వ్యతిరేకాలంకార మగుచున్నది.

మూ॥ యామాధురీ ప్రేమభరేణ దష్టే
జాగర్తి కాన్తా వరదన్త చేలే
సాదృశ్యతే భక్తి భరేణగీతే
ధరాధరాధీశ సుతాభిధానే. 21

ప్రేమాతిశయమున చుంబింపబడిన ప్రేయసి కెమ్మోవియందు విలసిల్లుచున్న మాధురి – భక్తి భరము చేత గానము చేయఁబడిన పర్వత కుమారియగు నుమాదేవి యొక్క నామమునందును గాన్పించును.

మూ॥ యత్ తేజగల్లమ్పుట! కేలి పివర్ణా
స్తస్మైఽమృతంనామ నగాత్మజాయాః
లాలామయో యోమమతం బ్రవీషి
సుధామయం శ్రీదశనచ్ఛదంత్వమ్ 22

ఓ జగల్లంపటా! (లోకమునం దాసక్తమగు చిత్తముగలవాఁడా!) నగరాజకుమారి యగు ఉమాదేవి నామము నీకు కేవలమును కొన్ని యక్షరములుగాఁ దోచుచున్నది. నాకానామము – అమృతమగుచున్నది. నీకు - అమృతమయమగుచున్న కాంతాధరము నాకు – లాలామయము (ముఖము నుండి స్రవించు ద్రవము, చొంగ.)

(ఈ పద్యము - నిరంతరము పఠనీయము)

ప్రభ:– కాంతాధరమును నీవు సుధామయమని చెప్పుచున్నావు. అది నోటి నుండి స్రవించు చొంగకంటె వేఱు కానేరదు. ఉమ యనునామము నీకక్షరములుగాఁ దోఁచుచున్నది. ఆ నామము వర్ణరూపము కాదు, సుధామయము.

మూ॥ ఉచ్చారయోచ్చాటితపాతకాని
నామాని జిహ్వే! భువనస్యమాతుః
తదావదామో మధుచూతరమ్భా
రామాధరాస్తే రుచ యేయదిస్యుః॥ 23

జిహ్వే! (ఓ రసనమా!) పాపములను తొలఁగించునవియగు జగజ్జనని యొక్క నామములనుచ్చరింపుము. అప్పుడు మకరందము, చూతఫలము, కదళీఫలము, కాంతాధరము అనునవి నీకు రుచించునేమో చూడుము.

ప్రభ:- నీవు దేవీ నామములను కీర్తించునెడల నీకు మకరందాదులు రుచింపవని మేము దృఢముగాఁ జెప్పగలమని భావము. 'భువనస్యమాతుః' అనుటకు బదులు ''నగకన్యకాయాః'' అను పాదము – మూలమునకుఁ గలదని తెలియునది.

మూ॥ ఆక్షేపమిక్షో రధికం విధత్తే
పీయూషదోషా నభితోఽభిధత్తే।
కాన్తాధరారబ్ధుర స్తవాదః
కపర్ది కాన్తావర నామనాదః ॥ 24

కపర్దియగు (జటాజూటము గల) శివుని కాంతయొక్క ప్రశస్తమగు నామధ్వని – రసవంతమగు నిక్షువు (చెఱకు) నాక్షేపించుచున్నది. అమృతమునందలి దోషములను సర్వతః తెలుపుచున్నది. కాంతాధరముతోడి యౌపమ్యమును సహింపక వాదించుచున్నది.

ప్రభ:- దేవీ నామామృతమునకు సాటి కానేరక కాంతాధరము – పరాభవింపఁబడునని భావము.

మూ॥ విశ్వాసహీనై స్సుతరామ బోధ్యం
నామానుభావం నగకన్యకాయాః।
జయన్తు సిద్ధైరపి గీయమానం
గాయన్త్వ ఏతా ఉపజాతయోనః॥ 25

విశ్వాసము లేనివారిచేత నించుకయు తెలియఁదగనిదియు, సిద్ధులచేతను గూడ గానము చేయఁబడునదియు అగు పార్వతీనామ ప్రభావమును కీర్తించునవియగు నాయీ ఉపజాతులు (ఉపజాతివృత్త నిబద్ధములగు స్తుతులు) జయించుఁగాక!

ఇది - సవ్యాఖ్యమగు - ఏకత్రింశస్స్తబకము.

* * * *